# కరపత్రం

SINCE 2014

బుధవారం అక్టోబర్ 16 2024 | సంపుటి :0 | సంచిక : 8 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4




## అర్థరాత్రి ఆటో ఎక్కిన యువతిపై అత్యాచారం

### ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

తనపై ఆటో డ్రైవర్ మరొకరు కలిసి అత్యాచారం చేశారని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసినట్లు ఫిర్యాదులో యువతి పేర్కొంది. అత్యాచారం చేసిన అనంతరం ఆటో డ్రైవర్‌తో పాటు అతడి స్నేహితుడు పారిపోయినట్లు తెలిపింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అత్యాచారానికి పాల్పడిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువతిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అయిన ఓ యువతి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. కానీ అదే ఆమె జీవితాన్ని నాశనం చేస్తుందని ఆయువతి ఊహించి ఉండదు. ఆర్సీపురం నుంచి గచ్చిబౌలి వెళ్లేందుకు యువతి ఆటో ఎక్కింది. అయితే యువతిపై కన్నేసిన ఆ ఆటో డ్రైవర్ ఆమెను నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అతడితో పాటు ఇంకో వ్యక్తి కూడా

ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చీకటి ప్రదేశానికి తీసుకువెళ్లి ఆటలో ఇద్దరు యువకులు అత్యాచారం చేశారు. మసీద్ బండ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆపై ఆ ఇద్దరు యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ గటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## 'ఆత్మనిర్భర్'లో భాగంగా..

# డేటా సెంటర్లు

- దేశీయంగా డేటా భద్రంగానే ఉంటుంది
- టెలీకమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీని ప్రారంభించిన మోడీ






నాలుగేళ్లకు ఒకసారి జరిగే వరల్డ్ టెలీకమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీ-2024 ఈవెంట్ ఈ ఏడాది దిల్లీలో అట్టహాసంగా మొదలైంది. ఈ ఈవెంట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి ఎగ్జిబిషన్‌లోని స్టాళ్లను పరిశీలించారు. దేశీయ ఆవిష్కరణలు ప్రదర్శించేందుకు నిర్వహించే ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ ఈవెంట్ 8వ ఎడిషన్‌ను కూడా ఈ కార్యక్రమంలోనే నిర్వహించారు. ఈ సందర్భంగా డేటా సెంటర్ల గురించి రిలయన్స్ జియో ఛైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రస్తావించారు. 'ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లను భారత్‌లో నెలకొల్పే సామర్థ్యం ఉన్నందున అవి దేశంలోనే ఉండాలని ఆకాశ్ అన్నారు. డేటా సెంటర్ పాలసీ 2020 ముసాయిదాను నవీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో భారత్‌లోని డేటా మొత్తం ఇక్కడి డేటా సెంటర్‌లోనే ఉంటుందన్నారు. భారత్ ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆకాశ్ అంబానీ అన్నారు. విద్య, వైద్యం,

మిగతాది 2లో

## ఎన్నికల్లో ఉచితాలపై సుప్రీంకోర్టులో పిటిషన్.. ఈసీకి నోటీసులు



ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలపై అత్యున్నత న్యాయస్థానంలో ఓ పిటిషన్ దాఖలైంది. ఈ క్రమంలో కేంద్రంతో పాటు, భారత ఎన్నికల సంఘానికి సుప్రీం నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచితాల హామీలను లంచాలుగా పరిగణించాలని కోరుతూ బెంగళూరుకు చెందిన ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు ఉచిత వాగ్దానాలు చేయకుండా నిరోధించడానికి చర్యలు తీసుకునేలా పోల్ ప్యానెల్‌ను ఆదేశించాలని అందులో కోరారు. ఈ ఉచితాల కారణంగా ప్రభుత్వ ఖజానాపై అధిక భారం పడుతుందని అభ్యర్థనలో వెల్లడించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను పరిశీలించింది. ఇదే అంశంపై పెడింగ్‌లో ఉన్న పలు కేసులతో కలిపి దీన్ని విచారించాలని సుప్రీం నిర్ణయించింది. ఈ క్రమంలోనే కేంద్రానికి, ఈసీకి నోటీసులు జారీ చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది విజయ్ హన్సారియా ఈ అంశంపై అత్యవసర విచారణ జరపాలని కోరారు. అదేవిధంగా ఎన్నికల ముందు ఉచిత వాగ్దానాలు ఓటర్లపై తీవ్ర ప్రభావితం చూపడంతో పాటు ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను దెబ్బతీస్తున్నాయని న్యాయస్థానంలో పేర్కొన్నారు.

## రాష్ట్రంలో చిత్తవుతున్న

# పత్తి రైతు

### ఫాక్స్‌కాన్ ఘనత మాదేనన్న కెటిఆర్



- లక్ష మంది తెలంగాణ యువతకు ఉద్యోగాలు ఇచ్చే ఫాక్స్‌కాన్ కంపెనీని కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.
- మరికొన్ని నెలల్లో కంపెనీ ప్రారంభం కానుండటం గర్వంగా ఉందని చెప్పారు.

2 లో

## ప్రభుత్వ తీరుపై కెటిఆర్ విమర్శలు



- పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు చెలగాటం ఆడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- నిన్న పెట్టుబడి సాయం అందించేలేదు, నేడు కష్టపడి పండించిన పంటను పంటను కొనుగోళ్లు చేయరా అని ప్రశ్నించారు.

2 లో

## రాడార్ కేంద్రం ఏర్పాటుపై రాజకీయమా


### కెటిఆర్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



తెలంగాణకు గర్వకారణమైన రాడార్ ప్రాజెక్టుపై భారాస, కేసీఆర్ కుటుంబం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మండిపడ్డారు. భారాస అధికారంలో ఉన్నప్పుడే దీనికి సంబంధించిన జీవోలు ఇచ్చారని గుర్తు చేశారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక మాట మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేవీ రాడార్ స్టేషన్‌కు సహకరించాల్సింది పోయి వ్యతిరేకంగా పోరాటం చేస్తామంటున్నారని విమర్శించారు. దేశ భద్రత, సమగ్రతకు వ్యతిరేకంగా పోరాటం చేస్తారా..? అని నిలదీశారు. రక్షణ శాఖకు సంబంధించిన షిప్స్‌ను కమ్యూనికేట్ చేసే రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణకు ఎంతో పేరు వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు జిల్లా అటవీ శాఖ నుంచి కేంద్ర పర్యావరణ శాఖ వరకూ అన్ని అనుమతులు

## దామగుండంలో నేవీ

# రాడార్ స్టేషన్..




### శంకుస్థాపన చేసిన రాజ్ నాథ్ సింగ్, రేవంత్ రెడ్డి

- దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో రాడార్ స్టేషన్..
- శంకుస్థాపన చేసిన కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్- సీఎం రేవంత్‌రెడ్డి..
- పాల్గొన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి- బండి సంజయ్..

దామగుండం నెవీ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ రోజు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటు కానుంది. దేశంలోనే రెండో అతిపెద్ద వీఎల్ఎఫ్ నేవీ రాడార్ సెంటర్‌గా కేంద్ర ప్రభుత్వం దీన్ని నిర్మిస్తోంది. శంకుస్థాపన స్థలానికి చేరుకున్న రాజనాథ్ సింగ్‌కు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు మరికొందరు బీజేపీ నేతలు స్వాగతం పలికారు.

మిగతాది 2లో

## డిఎస్సీకి ఎంపికైన వారికి నిరీక్షణ



### పోస్టింగ్ కౌన్సిలింగ్ ప్రక్రియ వాయిదా

తెలంగాణ డీఎస్సీ 2024 లో ఎంపికై ఉద్యోగాల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్న నిరుద్యోగ యువతకు కొంత నిరీక్షణ తప్పేలా లేదు. ఉపాధ్యాయ పోస్టింగ్ కేటాయించేందుకు నిర్వహించే కౌన్సెలింగ్ వాయిదా పడింది.

2 లో

## గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్

### పలు పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు



2 లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం అక్టోబర్ 16 2024

## ఏపీకి వెళ్లాల్సిందే.. ఐఏఎస్‌లకు క్యాట్ ఆదేశం




దిల్లీ: ఈ నెల 9న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, కె.ఆమ్రపాలి, ఎ.వాణీప్రసాద్, డి.రొనాల్డ్‌రాస్, జి.సృజనలకు కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్)లో ఊరట లభించలేదు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా క్యాట్ కీలక వ్యాఖ్యలు చేసింది. "ఏపీలో ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి చోటుకు వెళ్లి వారికి సేవ చేయాలని మీకు లేదా? ఐఏఎస్‌ల కేటాయింపులపై డీవోపీటీకి పూర్తి అధికారాలు ఉన్నాయి. స్థానికత ఉన్నప్పటికీ స్వాపింగ్ చేసుకునే అవకాశం గైడ్‌లైన్స్‌లో ఉందా?" అని క్యాట్ ప్రశ్నించింది. వన్ మ్యాన్ కమిటీ సిఫారసులను డీవోపీటీ పట్టించుకోవడం లేదని ఐఏఎస్ అధికారుల తరఫు న్యాయవాది క్యాట్ దృష్టికి తెచ్చారు. సింగిల్‌మెన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్రం ఉత్తర్వులు జారీ చేసే ముందు కమిటీ నివేదికను ఇవ్వలేదన్నారు. ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రొనాల్డ్‌రాస్‌లు కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏపీకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఏపీలో పనిచేస్తున్న సృజన తెలంగాణకు రావాల్సి ఉంది. ప్రస్తుతం తాము పనిచేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, కేంద్రం జారీ చేసిన కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. కేటాయింపుల సమయంలో కేంద్రం తమ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వాదనల అనంతరం .. డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. ఏపీకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## దిల్లీ-షికాగో విమానానికి బాంబు బెదిరింపు.. కెనడాకు మళ్లింపు




దిల్లీ: దేశీయంగా నడిచే, విదేశాలకు వెళ్లే పలు విమానాలకు బాంబు బెదిరింపులు హెచ్చరికలు రావడం కలకలం సృష్టిస్తోంది. తాజాగా దిల్లీ నుంచి షికాగో వెళ్తున్న ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో విమానాన్ని అత్యవసరంగా కెనడా కు మళ్లించినట్లు విమానయాన సంస్థ వెల్లడించింది. దిల్లీ-షికాగో మధ్య నడిచే ఎయిరిండియా విమానం ఏఐ127 మంగళవారం దిల్లీ నుంచి బయలుదేరింది. ఈ క్రమంలోనే విమానానికి భద్రతా ముప్పు పొంచి ఉందంటూ ఆన్‌లైన్‌లో ఓ పోస్టు కనిపించింది. ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని కెనడాలోని ఇకాలూట్ ఎయిర్‌పోర్టుకు మళ్లించినట్లు ఎయిరిండియా పేర్కొంది. భద్రతా నిబంధనల ప్రకారం విమానంతోపాటు ప్రయాణికులందరినీ క్షుణ్నంగా తనిఖీ చేస్తామని తెలిపింది. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రయాణికులకు సహాయం చేసేందుకు అక్కడి ఎయిర్‌పోర్టు విభాగాలన్నింటినీ అప్రమత్తం చేశామని, అనంతరం తిరిగి వారి ప్రయాణం కొనసాగుతుందని ఎయిరిండియా ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే, మంగళవారం తెల్లవారుజామున దిల్లీ నుంచి బయలుదేరిన ఈ విమానం అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 7గంటలకు షికాగో చేరుకోవాల్సి ఉంది. ఆన్‌లైన్ ట్రాకింగ్ ప్రకారం ప్రస్తుతం ఆ విమానం ఇంకా కెనడాలోని ఎయిర్‌పోర్టులోనే ఉన్నట్లు సమాచారం.

## ఎన్నికల్లో ఉచితాలపై సుప్రీంకోర్టులో పిటిషన్.. ఈసీకి నోటీసులు

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలపై అత్యున్నత న్యాయస్థానంలో ఓ పిటిషన్ దాఖలైంది. ఈ క్రమంలో కేంద్రంతో పాటు, భారత ఎన్నికల సంఘానికి సుప్రీం నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచితాల హామీలను లంచాలుగా పరిగణించాలని కోరుతూ బెంగళూరుకు చెందిన ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు ఉచిత వాగ్దానాలు చేయకుండా నిరోధించడానికి చర్యలు తీసుకునేలా పోల్ ప్యానెల్‌ను ఆదేశించాలని అందులో కోరారు. ఈ ఉచితాల కారణంగా ప్రభుత్వ ఖజానాపై అధిక భారం పడుతుందని అభ్యర్థనలో వెల్లడించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను పరిశీలించింది.

# రాష్ట్రంలో చిత్తవుతున్న పత్తి రైతు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టి మరింత విస్తరిస్తారని ఆశిస్తున్నానని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హాన్ హాయ్ టెక్నాలజీ గ్రూప్‌నకు చెందిన ఫాక్స్‌కాన్ తెలంగాణలో రూ.1656 కోట్లకుపైగా పెట్టుబడితో కొంగరకలాన్‌లో పరిశ్రమను నెలకొల్పనుంది. దీనికి సంబంధించి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంతో 2023లో ఫాక్స్‌కాన్ ఒప్పందం చేసుకున్నది. గతేడాది మార్చి 15న కొంగరకలాన్‌లో కేటీఆర్ ఫాక్స్‌కాన్‌కు భూమిపూజ చేశారు. తాజాగా రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరించడానికి సముఖత వ్యక్తం చేసింది.

# ప్రభుత్వ తీరుపై కెటిఆర్ విమర్శలు

మొదటి పేజీ తరువాయి

మార్కెట్‌కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలు ఎక్కడన్నారు. ఇందిరమ్మ రాజ్యమని చెప్పి దళారుల రాజ్యం తెస్తారా అని నిలదీశారు. బడే భాయ్ రాష్ట్రంలో పత్తి రైతుకు పట్టాభిషేకం చేస్తుండగా, ఛోటా భాయ్ పాలనలో మాత్రం పత్తి రైతు చిత్తవుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో పత్తికి మద్దతు ధరకు మించి రూ.8,257 ఇస్తున్నారని, మరి తెలంగాణలో రేతుకు చెల్లిస్తున్నది కేవలం రూ.5 వేలేనా అని ప్రశ్నించారు. రెండేండ్ల క్రితం పత్తి ధర రూ.10 నుంచి రూ.15 వేలు పలికిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ అనర్థం ఏమిటని ఎక్స్ వేదిగా ఫైర్ అయ్యారు. 'బడా భాయ్ రాష్ట్రంలో పత్తి రైతుకు పట్టాభిషేకం. ఛోటా భాయ్ పాలనలో మాత్రం పత్తి రైతు చిత్తు. గుజరాత్ లో మద్దతు ధరకు మించి రూ.8,257 రేటు. మరి తెలంగాణలో పత్తి రైతుకు కేవలం రూ.5 వేలేనా?. మార్కెట్ కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలెక్కడ?. ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెస్తారా?. రెండేళ్ల క్రితం పత్తికి 10 నుంచి 15 వేల ధర. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏమిటీ అనర్థం?. నిన్న పెట్టుబడి సాయం అందించలేదు.. నేడు కష్టించి పండించినా కొనుగోళ్లు చేయరా..? పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు చెలగాటం. ముందుచూపు లేని ముఖ్యమంత్రి వల్లే ఈ అన్యాయం.' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్

మొదటి పేజీ తరువాయి

గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్‌లు దాఖలు చేశారు. మంగళవారం ఉదయం ఈ పిటిషన్లపై హైకోర్టులో విచారణకు వచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1లో తప్పుడు ప్రశ్నలను తొలగించాలని ఒక పిటిషన్ దాఖలవగా.. ప్రిలిమినరీ కీ లో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు చేశారు. తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్ల పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. త్వరలో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే మెయిన్స్ విద్యార్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌లను కొట్టివేసింది. దీంతో ఈనెల 21 నుంచి గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరుగనున్నాయి. మరోవైపు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు ఈ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలను హెచ్ఎండీఏ పరిధిలో నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్లు పరీక్ష ప్రారంభమయ్యే ఒక రోజు ముందు వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్ష హాల్‌లోకి చేరుకోవాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను అనుమతించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని స్పష్టంచేశారు. మెయిన్స్‌లో భాగంగా ప్రతి అభ్యర్థి ఆరు పేపర్లకు సంబంధించి పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

# దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్..

మొదటి పేజీ తరువాయి

అనంతరం శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి చేరుకుని ప్రసంగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణలో తెలంగాణ స్టేట్ కీలక అడుగు ముందుకు వేసిందన్నారు. దేశ రక్షణ శాఖా వ్యవస్థ కోసం హైదరాబాద్ నిలయంగా ఉందన్నారు. దేశంలో సముద్ర మార్గంలో ప్రయాణించే వ్యవస్థ కోసం వికారాబాద్ లో వీ.ఎల్.ఎఫ్ ఏర్పాటు హర్షణీయం అని తెలిపారు. వికారాబాద్ లో రెండవ వీ ఎల్ ఎఫ్ ఏర్పాటు చేస్తుంటే అపోహలు సృష్టిస్తున్నారన్నారు. దేశ భద్రత రక్షణ కోసం తెలంగాణ సమాజం ఆలోచించాలన్నారు. దేశ భద్రత కోసం ఏర్పాటు చేసే ప్రాజెక్ట్ రాజకీయం చేయడం మానుకోవాలన్నారు. ప్రాజెక్ట్ ప్రారంబించాలని రాజ్ నాథ్ సింగ్ నాతో మాట్లాడారు వెంటనే ఆదిశగా అడుగులు వేశామన్నారు. దేశ రక్షణ కోసం ప్రభుత్వంలో ఉన్న మేమంతా పాటు పడుతామని తెలిపారు. వి ఎల్ ఏ స్టేషన్ ప్రాజెక్ట్ చేపడుతున్న చోట ఇక్కడ రామలింగేశ్వర దేవాలయం ఉంది భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్మాణం చేపట్టాలని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ కోరుతున్నానని తెలిపారు. ఇదిలా ఉండగా 10 ఏళ్ల క్రితమే రాడార్ సెంటర్ ఏర్పాటు ప్రక్రియను కేంద్రం ప్రారంభించినా. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దామగుండం అటవీ ప్రాంతంలో 2900 ఎకరాల భూమిని కేటాయించి రాడార్ సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది.

## ఆత్మనిర్భర్‌లో భాగంగా..

# డేటా సెంటర్లు




మొదటి పేజీ తరువాయి

వ్యవసాయం.. ఇలా ప్రతి రంగంలోనూ ముందుకెళ్లేందుకు ఏఐ ఓ విప్లవాత్మక సాధనమని పేర్కొన్నారు. అందుకే ఏఐ, మెషిన్ లెర్నింగ్ డేటా సెంటర్‌లు ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్న కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. మొదటిసారి భారత్‌లో జరుగుతున్న డబ్ల్యూటీఎస్ఏ కార్యక్రమంలో పాల్గొనేందుకు 190 దేశాల నుంచి 3,000 మంది పారిశ్రామిక, సాంకేతికత నిపుణులు హాజరయ్యారు. 'ది ఫ్యూచర్ ఈ నౌ' థీమ్‌తో నిర్వహిస్తున్న ఈవెంట్‌లో 120కి పైగా దేశాల నుంచి 400కు పైగా ఎగ్జిబిషన్లు, 900కు పైగా స్టార్టప్‌లు ప్రదర్శించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి సింధియా దేశీయ టెలికాం గురించి మాట్లాడారు. భారత్‌లో టెలికాం అనేది కేవలం వినోద మాధ్యమం

కాదని బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కీలకమైన సమాచారం, గ్లోబల్ కమ్యూనిటీతో కనెక్ట్ అయ్యే సదుపాయాల కోసం వేగంగా విస్తరించిందన్నారు. 5జీ నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తోందన్నారు. స్పామ్ కాల్స్ పెరుగుతున్న తరుణంలో వీటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రముఖ వ్యాపారవేత్త కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు.

# డిఎస్సీకి ఎంపికైన వారికి నిరీక్షణ

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాల్సిన కౌన్సెలింగ్ కొత్త తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని విద్యాశాఖ తెలిపింది. ఈ మధ్య విడుల చేసిన డీఎస్సీ-2024 ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించిన వాళ్లకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చారు. ఈ పత్రాలు తీసుకున్న 10,006 మందికి మంగళవారం నుంచి పోస్టింగ్ అలాట్ చేయాల్సి ఉంది. అయితే ఈ పక్రియను వాయిదా వేస్తున్నట్టు విద్యాశాఖ వెల్లడించింది. డీఈవో ఆఫీస్‌లకు వెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొంది. అభ్యర్థులందరికీ ప్రత్యేకంగా సమాచారం ఇచ్చారు. కొత్త తేదీలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. జిల్లాలకు సంబంధించిన డాటా ఇంకా పూర్తిస్థాయిలో రాకపోవడంతో ప్రస్తుతానికి కౌన్సెలింగ్ వాయిదా వేసినట్టు అధికారులు తెలిపారు. డాటా వచ్చిన వెంటనే కొత్త తేదీలు ప్రకటిస్తామన్నారు. ఒకట్రెండు రోజుల్లోనే ప్రకటన ఉంటుందని అంటున్నారు. జిల్లాలో కౌన్సిలింగ్ నిర్వహించాలి అంటే వివిధ జిల్లాలో ఉన్న వేకెన్సీలు, స్కూళ్ల డాటా లేటెస్ట్ ఉండాలి. దాన్ని ఇంటిగ్రేట్ చేయాల్సి ఉంటుంది. అందుకే ఈ పక్రియ పూర్తి కాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ డాటా లేకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తే గందరగోళం ఏర్పడుతుందని అంటున్నారు.

## తైవాన్ చుట్టూ చైనా మిలిటరీ విమానాల చక్కర్లు

## ఆందోళన వ్యక్తం చేసిన జపాన్

స్వతంత్ర ద్వీపదేశమైన తైవాన్ చుట్టూ 153 చైనా మిలిటరీ విమానాలు చక్కర్లు కొట్టినట్లుగా తైవాన్ రక్షణశాఖ వెల్లడించింది. మంగళవారం ఉదయం 6 గంటల వరకు తైవాన్‌ను చుట్టుముట్టి న విమానాల వివరాలను రికార్డు చేసినట్లు పేర్కొంది. 25 గంటల వ్యవధిలో చైనా నౌకాదళానికి చెందిన 14 నౌకలను నమోదుచేసినట్లుగా తెలిపింది. ఇది అసమంజసమని, సహేతుకం కాదని, రెచ్చగొట్టే చర్యలా ఉందని రక్షణశాఖ ఉన్నతాధికారులు చైనాపై మండిపడ్డారు. గతంలో ఎప్పుడూ ఇలా ఒకేరోజు యుద్ధ విమానాలతో విన్యాసాలు నిర్వహించలేదన్నారు. కాగా తమ దేశానికి చెందిన యోనాగుని ద్వీపం సమీపంలో చైనా కసరత్తులు చేపట్టడంపై జపాన్ ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేసింది. చైనా చేపడుతున్న చర్యలను తాము నిశితంగా పరిశీలిస్తున్నామని జపాన్ డిప్యూటీ చీఫ్ కేబినెట్ సెక్రటరీ కజుహికో అయోకి తెలిపారు. ఈ ఘటనపై తాజాగా అమెరికా స్పందించింది. చైనా చేపట్టిన చర్యల వల్ల ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడింది. బీజింగ్ సంయమనంతో వ్యవహరించాలని పేర్కొంది.

చైనా సోమవారం తైవాన్ చుట్టూ ఆర్మీ, నేవీ, వాయుసేన, క్షిపణి బలగాలను మోహరించి, భారీ సైనిక విన్యాసాలు చేపట్టింది. సముద్ర జలాల్లో విమానవాహక నౌకలను రంగంలోకి దించింది. పొరుగుదేశాన్ని దాదాపు అన్నివైపుల నుంచి దిగ్బంధించినట్లుగా రోజంతా కొనసాగించిన యుద్ధ విన్యాసాలను సాయంత్రానికి ముగించినట్లు చైనా సైన్యం పీఎల్ఏ ప్రకటించింది. 'జాయింట్ స్వోర్డ్-2024బి' పేరుతో నిర్వహించిన సమీకృత సంయుక్త విన్యాసాల్లో అన్ని విభాగాల శక్తి సామర్థ్యాలను పరీక్షించినట్లు పీఎల్ఏ అధికార ప్రతినిధి, సీనియర్ కెప్టెన్ లీ షీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ భారీ విన్యాసాలను తైవాన్‌కు హెచ్చరికగా అభివర్ణించారు. ఐదు రోజుల క్రితం జరిగిన తైవాన్ జాతీయ దినోత్సవం సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు లై చింగ్ ప్రసంగిస్తూ 'తైవాన్ ఏ దేశానికీ అధీనం కాదు' అని చేసిన వ్యాఖ్యలకు హెచ్చరికగా ఈ చర్యలు చేపట్టినట్లు చైనా సీనియర్ అధికారి పేర్కొన్నారు.

# బుద్ధి మార్చుకోని కెనడా ప్రభుత్వం

ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య జరిగిన దగ్గరినుంచి భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతోన్న కెనడా.. తన బుద్ధి మార్చుకోవడం లేదు. ఇప్పుడు ఏకంగా భారత్‌పై ఆంక్షలకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. ఆ దేశ విదేశాంగ మంత్రి మెలానీ జోలీ ఆ అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామంటూ రెచ్చగొట్టేలా స్పందించారు. నిజ్జర్ హత్య కేసు అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మను చేర్చడంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మళ్లీ భగ్గుమన్నాయి. దీనిపై తాజాగా కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో న్యూదిల్లీపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. నిజ్జర్ హత్య కేసు దర్యాప్తునకు భారత్ సహకరించడం లేదని ఆరోపించారు. అయితే, కెనడా ఆరోపణలు న్యూదిల్లీ ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉంది. ఎలాంటి సాక్ష్యాలు ఇవ్వకుండా ఒట్టావా నిరాధార ఆరోపణలు చేస్తోందని మండిపడింది. ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా కెనడా ప్రభుత్వం మన రాయబారిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, పెద్దఎత్తున బురద జల్లే ప్రయత్నం చేస్తోందని తీవ్ర పదజాలంతో ఆక్షేపించింది. తాజా పరిణామాల నేపథ్యంలో సంజయ్‌కుమార్ వర్మను, మరికొందరు అధికారుల్ని అక్కడినుంచి వెనక్కి తెచ్చేయాలని కేంద్రం నిర్ణయించింది. దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించాలని కూడా నిర్ణయం తీసుకుంది. వారు ఈనెల 19వ తేదీ రాత్రి 11.59 గంటల్లోగా భారత్‌ను వీడి వెళ్లాలని గడువు విధించింది. ప్రతిగా కెనడా సైతం ఆరుగురు భారత దౌత్యాధికారుల్ని బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇది ఇంతటితో ఆగలేదు. ఈసారి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరును తెరపైకి తెచ్చింది. ఆ గ్యాంగ్‌తో కలిసి భారత ఏజెంట్లు.. ప్రో ఖలీస్థానీలను లక్ష్యంగా చేసుకొని కెనడా భూభాగంపై పని చేస్తున్నారంటూ తీవ్రంగా ఆరోపించింది. తాజాగా ఆ దేశ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ ఆంక్షల ప్రస్తావన తెచ్చారు. మరోవైపు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ తో భారత ఏజెంట్లకు సంబంధాలు ఉన్నాయంటూ వ్యాఖ్యానించింది. ఆ గ్యాంగ్‌తో కలిసి భారత ఏజెంట్లు.. ప్రో ఖలిస్థానీలను లక్ష్యంగా చేసుకొని కెనడాలో పని చేస్తున్నారంటూ ఆరోపించింది. 'కెనడాలో ఉన్న భారత ఏజెంట్లు ప్రో ఖలిస్థానీలను లక్ష్యంగా చేసుకొని లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో కలిసి పని చేస్తున్నాయి' అని ఆరోపించింది. ఖలిస్థానీ తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసుకు సంబంధించిన దర్యాప్తు పురోగతి వివరాలను రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు సోమవారం రాత్రి మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. భారత ఏజెంట్లు తమ భూభాగంపై హత్యలు, హింసాత్మక కార్యకలాపాలకు (బ౹సతినీబీబ ఇసతిపతినిజీ జీఇబితిలతిబా) పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. కెనడాలోని దక్షిణాసియా కమూనిటీని ముఖ్యంగా ప్రో ఖలిస్థానీలను భారత ఏజెంట్లు లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నేర కార్యకలాపాల్లో బిష్ణోయ్ గ్రూప్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ గ్యాంగ్‌కు భారత ప్రభుత్వ ఏజెంట్లతో సంబంధాలు ఉన్నట్లు తాము విశ్వసిస్తున్నామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# ఘనంగా అబ్దుల్ కలాం జయంతి:

## మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలి:

**భూషిపాక సంతోష్ మహారాజ్:**
**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి: రామగుండం: అక్టోబర్ 15:కరపత్రం**



మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకొని గోదావరిఖని అడ్డగుంట కట్ట దగ్గర గల కలాం విగ్రహానికి పూలమాలసి నివాళులర్పించిన ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత భూషిపాక సంతోష్ మహారాజ్.అనంతరం వారు మాట్లాడుతూ....అబ్దుల్ కలాం వినయం, ముందుచూపు, విజ్ఞానం, విద్య మీద ఉన్న అచంచలమైన అంకితభావం లక్షలాది మంది హృదయాలలో చెరగని ముద్ర వేసిందనీ,కలాం జీ వారసత్వం మానవాళికి ఆశాజ్యోతిగా భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందనీ" అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని, అయన జీవితం ప్రతి విద్యార్థికి స్ఫూర్తినిస్తుందని, అబ్దుల్ కలాం, తన జీవితంలో పట్టుదల కృషి ఉంటే విజయాలు సాధించడం కష్టం కాదని నిరూపించారని, భారతజాతి గర్వించదగ్గ గొప్ప మేధావి, క్షిపణి పితామహుడు, భావితరాలకు మార్గదర్శి అని ,భారతరత్న ఏపీజే అబ్దుల్‌కలాం స్ఫూర్తి దేశానికే ఆదర్శమని వారు అన్నారు.

# పట్టభద్రుల సమస్యల పరిష్కారమే ధ్యేయం...

## ప్రైవేటు , ప్రభుత్వ నిరుద్యోగులకు బాసటగా నిలుస్తా....

**- విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ కల్పించా..ఎంతో మందికి ఉచిత విద్య' వసతి అందించా...**
**- హుజురాబాద్ లో వాకర్స్ తో ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి....**







**కరపత్రం శంకరపట్నం అక్టోబర్ 15**
పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు మంగళవారం కరీంనగర్ జిల్లా, హుజురాబాద్ పట్టణ కేంద్రంలో వాకర్స్ తో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలని, నిరుద్యోగులకు బాసటగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గొంతుకనై పోరాడుతానని, 34 యేండ్ల లో ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ కల్పించామని, చాలా మందికి ఉచిత విద్యతో పాటు వసతి కల్పించామని, వారంతా ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగల తో పాటు, విదేశాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. కొంతమంది తనపై చేస్తున్న దుష్ప్రచారం కేవలం రాజకీయ విమర్శలే అని కొట్టి పారేశారు. విద్యా ఉద్యోగ అవకాశాలు కల్పించి నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఉద్దేశంతోనే తాను శాసనమండలి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని తనను ఆశీర్వదించి గెలిపిస్తే విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ యువతకు ఉపాధి మార్గాలు చూపడమే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. విలువలతో కూడిన విద్యను అందించాలనే తపనతో పెద్దల సభలోకి వెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నానని, ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగుల సమస్యలు తీర్చడంతో పాటు వృత్తి నైపుణ్య కోర్సులను ప్రవేశపెట్టడమే లక్ష్యంగా పనిచేస్తాననిఅన్నారు.. పట్టభద్రులంతా తనను గెలిపిస్తే చట్టాల రూపకల్పనతోపాటు ,నిరుద్యోగ సమస్య, నిర్మూలన ఎజెండాగా పనిచేస్తానని హామీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి శిష్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి...

**- పశువులకు వ్యాధి నిరోధక టీకాలు**
**కరపత్రం శంకరపట్నం అక్టోబర్ 15**



పశు వైద్య శిబిరాలను పశువుల పెంపకం దారులు వినియోగించుకొని పశువుల సంరక్షణ చేపట్టాలని మొలంగూర్ పశు వైద్య అధికారి వి మాధవరావు కోరారు. మంగళవారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించి, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. అధికారి మాధవరం మాట్లాడారు. ప్రభుత్వము పాడి పశవుల సంరక్షణ కోసం పాడి గేదెలకు, ఆవులకు గాలికుంటు వ్యాధి నిరోధక టికాలు ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించి పశువులకు వేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని పశువుల పెంపకం దారులు వినియోగించుకోవాలని, మండలంలోని మొలంగూర్ గ్రామంలో 139 ఆవులకు, పాడి గేదెలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పేర్కొన్నారు పశువుల రక్షణ కోసం పశువుల పెంపకం దారులు ఉచిత పశు వైద్య శిబిరాల్లో పశువులను వైద్య పరీక్షలు చేయించుకొని పశువుల ఆరోగ్యం సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది అమీర్ ఖాన్, అజాహర్, గోపాలమిత్ర మొండయ్య, పాలకేంద్రం ప్రతినిధులు భాస్కర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి ,బుచ్చిరెడ్డి, పశువుల పెంపకం దారులు తదితరులు పాల్గొన్నారు.

# 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు నమోదు. జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి.

## - డి ఆర్ ఓ. హరిప్రియ

**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి.**

మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలో వార్డు మెంబర్ల సహకరంతో 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు నమోదు చేసుకునేలా పార్టీల ప్రతినిధులు చొరవ తీసుకోవాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు.

మంగళవారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ విసి హాల్ లో డిఆర్ఓ హరిప్రియతో కలిసి అదనపు కలెక్టరు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టరు మాట్లాడుతూ జిల్లా 18 ఏళ్లు నిండిన యువత శాతం ఎక్కువగా ఉన్నప్పటికి, ఓటరు నమోదు శాతం పెరగడం లేదని అన్నారు. ఇందుకు గాను వార్డు మెంబర్ల భాగస్వామ్యంతో యువత కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు నమోదు చేసుకునేలా చూడాలని పార్టీ ప్రతినిధులను కోరారు. జిల్లాలో ఓటరు నమోదు





శాతాన్ని పెంచాలన్నారు. భారత ప్రభుత్వ ఎన్నిక కమీషన్ సూచనల మేరకు జిల్లాలో ఓటర్లకు అనుకూలంగా ఉండేలా, 1500 మందికి ఒక పొలింగ్ బూతు ప్రకారం జిల్లాలో అదనంగా 38 పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో అదనంగా నియోజక వర్గాల వారిగా మేడ్చెల్ నందు 21, మల్కాజిగిరిలో 7, కుత్బుల్లాపూర్ లో 10 పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడంతో, ప్రస్తుతం జిల్లాలో 2435 పోలింగ్ బూతులు ఉన్నాయన్నారు. ఓటర్లకు సమీపంగా, సౌకర్యవంతంగా ఉండేలా పరిశీలించి ఈబూతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూతుల నంబర్ల సవరింపులో కొన్ని బూతుల నంబర్లు మారుతాయని, బూతు పొలింగ్ అధికారులు ఈ మార్పు పై ఓటర్లకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వర్ రెడ్డి, పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు యూసుఫ్ ను వెంటనే విడుదల చేయాలి

## -జైల్లో జర్నలిస్టు యూసుఫ్ ను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్,అక్టోబర్ 15:**
జర్నలిస్టు యూసుఫ్ పై చందుర్తి పోలీసులు అక్రమ కేసు బనాయించి జైల్లో పెట్టడం అన్యాయమని, అతనిని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మెర తిరుపతిరెడ్డి, బాపురావు, మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి ఎం.గోపాల్ తదితరులు కరీంనగర్ జిల్లా జైల్లో ఉన్న జర్నలిస్టు యూసుఫ్ ను కలిసారు. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన విషయాలను జర్నలిస్టు యూసుఫ్ ను అడిగి తెలుసుకున్నారు. ఇతరుల కేసులో తనను ఇరికించారని, తాను ఏ తప్పు చేయలేదని, పోలీసులు కావాలని తనపై తప్పుడు కేసు పెట్టారని జర్నలిస్టు యూసుఫ్ చెప్పారు. అనంతరం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి పోలీసులు ఇటీవల తమ ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్, సిరిసిల్ల జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడైన ఎండి యూసుఫ్ కు సంబంధంలేని ఒక కేసును అంటగట్టి అతనిపై అక్రమంగా కేసు నమోదు చేశారని తెలిపారు. యూసుఫ్ పై పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరింపజేసి, అతనిని వెంటనే విడుదల చేయాలని కోరారు. తప్పు చేయని జర్నలిస్టులపై ఇలా తప్పుడు కేసులు పెట్టడం తగదని, ఈ సంఘటనపై ప్రత్యేక అధికారితో విచారణ జరిపించి జర్నలిస్టు యూసుఫ్ పై తప్పుడు కేసు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టులపై అక్రమ కేసులు ఉండవని భావించామని, కానీ అక్రమ కేసుల బనాయింపులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టు యూసుఫ్ పై చందుర్తి పోలీసులు అక్రమ కేసు పెట్టడం సహించరానిదని అన్నారు. యూసుఫ్ పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని,అతనిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# గ్రుప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా.

## - బి.ఆర్.ఓ హరిప్రియ.

**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి.**





తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహిస్తున్న గ్రూప్ -1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి, పరీక్షలు ప్రశాంతంగా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు (లోకల్ బాడీస్)రాధికా గుప్తా అన్నారు. మంగళవారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో టిజిపిఎస్సి గ్రూప్ -1రాత పరీక్ష పై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి డిఆర్ఓ హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్ రాధికా గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఛీఫ్ సూపరింటెండెంట్లు, ప్లైయింగ్ స్క్వాడ్స్,రూట్ ఆఫీసర్లు, డిపార్ట్ మెంట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు వారి వారికి కేటాయించిన విధులను సమయపాలన పాటిస్తూ, ఏలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. ప్రతి ఒక అంశము నియమ నిబంధనల ప్రకారం చేయాలని, మీకు కేటాయించినంత వరకు మాత్రమే మీరు మీ విధులను నిర్వహించాలని అదనపు కలెక్టరు సూచించారు. ఛీఫ్ సూపరింటెడెంట్లు పరీక్షా కేంద్రాలను పరిశీలించి అవసరమైన మౌళిక వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందరితో సమన్వయం చేసుకుంటూ గ్రుప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. భద్రత పోలీసు శాఖ వారితో, నిరంతరాయ విద్యుత్తు, త్రాగునీరు సంబంధిత శాఖల అధికారులతో కో ఆర్డినేట్ చేసుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. డిపార్ట్ మెంట్ ఆఫీసర్లు ఒకరోజు ముందుగానే మీకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను పరిశీలించుకోవాలన్నారు. పరీక్షా సెంటర్లలోరూట్ మ్యాప్ లు, సైన్ బోర్డ్స్, సీటింగ్ అరేంజ్ మెంట్ వంటి వాటిని సరిగా ఉన్నాయా అని పరిశీలించాలి. ఈ పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న అధికారులందరి మోబైల్ ఫోన్లను పరీక్షా కేంద్రాలలోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేసారు. సంబంధిత అధికారులు వారి నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అధికారులకు అందించే డైరీ ప్రకారం టైమ్ టు టైమ్ సరైన విధంగా విధులు నిర్వహించాలని అన్నారు.

# పేదోడి కల సాకారానికి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఏర్పాటు...

## - మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 15.**



రాష్ట్రంలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కమిటీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది.గ్రామ, మునిసిపల్ స్థాయిలో ఏర్పాటు,ఊళ్లలో సర్పంచ్ లేదా పంచాయతీ ప్రత్యేకాధికారి చైర్మన్,మునిసిపాలిటీలో చైర్మన్‌గా కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ సభ్యులుగా మహిళా సంఘము నుండి ఇద్దరు, బీసీ, ఎస్సీ, ఎస్టీల నుంచి ఒక్కొక్కరు గా నియమించుకోవాలని సూచించారు.ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకం కూడా ఇందిరమ్మ కమిటీల పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుంది.గ్రామస్థాయిలో మండల స్థాయిలో వార్డు స్థాయిలో మున్సిపాలిటీలో కూడా సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా చేరవేసే విధంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాధ్యతగా పర్యవేక్షిస్తారు .గ్రామాలలో పేద ప్రజలకు గుర్తించేందుకు ఇందిరమ్మ కమిటీలు నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుంది...ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నటువంటి అర్హత కలిగిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే విధంగా ఈ యొక్క కమిటీలు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు నల్ల కొండల్ రెడ్డి,చదువు జైపాల్ రెడ్డి, జున్నుతుల మధుకర్ రెడ్డి,ఈదునూరి పైడి కుమార్, కంకణాల జగదీశ్వర్ రెడ్డి, పర్లపల్లి ప్రసాద్, పత్తి సమ్మిరెడ్డి, ఆలేటి శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం అక్టోబర్ 16 2024



# జాతీయ బ్రాండ్ అంబాసిడర్‌గా నటి రష్మిక..

## సైబర్ నేరాల నివారణే లక్ష్యం

నటి రష్మిక ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. ఈవిషయాన్ని కేంద్ర హెూంశాఖకు చెందిన సైబర్ దోస్త్ విభాగం ప్రకటించింది. ఈమేరకు రష్మిక కూడా ఓ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. అందులో గతంలో తాను ఎదుర్కొన్న డీప్ ఫేక్ గురించి ప్రస్తావించారు."కొన్ని నెలల క్రితం నా డీప్ ఫేక్ వీడియో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. అది సైబర్ క్రైమ్. ఆ చేదు అనుభవం తర్వాత నేను సైబర్ క్రైమ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నా. దీని గురించి అందరికీ అవగాహన కల్పించాలని అనుకున్నాను. తాజాగా మీ ముందుకు ఓ విషయాన్ని పంచుకోవడానికి వచ్చాను. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు నేను బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పడానికి సంతోషిస్తున్నా. కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ అధ్వర్యంలో ఇది పనిచేస్తుంది. సైబర్ నేరస్థులు మనల్ని టార్గెట్ చేయడానికి సిద్ధంగా ఉంటారు. మనం అలర్ట్‌గా ఉండడమే కాదు.. వాళ్ల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలి. అలాగే ఇలాంటి నేరాలు జరగకుండా చూడాలి. సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ బ్రాండ్ అంబాసిడర్‌గా నేను ఇలాంటి నేరాలపై అవగాహన పెంచుతాను. మన దేశాన్ని సైబర్ నేరాల నుంచి కాపాడతాను" అని రష్మిక అన్నారు. గతంలో రష్మిక డీప్ ఫేక్ వీడియో ఇండస్ట్రీలో సంచలనం సృష్టించింది. సోషల్ మీడియా జారా పటేల్ వీడియోకు రష్మిక ముఖాన్ని ఉపయోగించారు. చూడటానికి అభ్యంతరకరంగా ఉన్న ఆ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. టెక్నాలజీని చూస్తుంటే భయంగా ఉందంటూ రష్మిక ఆవేదన వ్యక్తంచేశారు. ఆమె తర్వాత మరికొందరు సినీ, క్రీడా ప్రముఖుల డీప్ ఫేక్ వీడియోలు కూడా వైరలయ్యాయి. డీప్‌ఫేక్‌లపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో కేంద్రం కూడా దీన్ని సీరియస్‌గా తీసుకున్న విషయం తెలిసిందే.

# కొత్త సినిమాను ప్రారంభించిన సాయిదుర్గా తేజ్




వైవిధ్యమైన కథలు ఎంచుకునే హీరోల్లో సాయి దుర్గా తేజ్ ఒకరు. 'విరూపాక్ష', 'బ్రో' తర్వాత ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ యంగ్ హీరో పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కొత్త సినిమాను ప్రకటించారు. ఎస్‌డిటి18 వర్కింగ్ టైటిల్‌తో ఇది తెరకెక్కనుంది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం ఓ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయం కానున్నారు. 'ధైర్యాన్నే తన కవచంగా, ఆశనే ఆయుధంగా చేసుకున్న ఈ వ్యక్తి అందరికోసం నిలబడతాడు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే' అనే క్యాప్షన్‌తో ఓ వీడియోను విడుదల చేస్తూ చిత్రబృందం సాయి దుర్గా తేజ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది.

# వాళై చిత్రంతో అద్భుత నటన

### దర్శకుడి ప్రతిభ అంటున్న నటి నిఖిలా విమల్



తాను ఒక పరికరాన్ని మాత్రమేనని, దర్శకుడు తనకు నచ్చిన రీతిలో మలచుకున్నారని హీరోయిన్ నిఖిలా విమల్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఆయన స్వీయ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'వాళై'ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సినిమాలో పూంగొడి టీచర్‌గా కీలక పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించిన నిఖిలా విమల్ చిత్రంలో నటించిన తన అనుభవం, పూంగొడి టీచర్ పాత్రను దర్శకుడు మలిచిన తీరు వర్ణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'వాళై' సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప విషయం. ఆ పాత్రకు తగినట్టుగా దర్శకుడు నన్ను మలుచు కున్నారన్నారు. నేను ఒక పరికరాన్ని మాత్రమే. 'కర్ణన్' చిత్రంలో హీరోయిన్ రజీషా విజయన్ పాత్రకు డబ్బింగ్ చెప్పడానికి చెన్నైకి రాగా ఆ సమయంలోనే 'వాళై'చిత్రం గురించి దర్శకుడు చెప్పారు. చెప్పిన మాట ప్రకారం చిత్రాన్ని నిర్మించి, అందులో నా కెరీర్‌లో నిలిచిపోయే పాత్రను ఇచ్చిన దర్శకుడికి రుణపడి ఉంటాను' అని పేర్కొన్నారు.

# గేమ్‌ఛేంజర్‌కు పోటీగా తండేల్ విడుదల

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య నటిస్తోన్న ప్రాజెక్ట్ తండేల్ రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని చందూ మొండేటి డైరెక్ట్ చేస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు చాలా రోజుల క్రితమే ప్రకటించగా.. తండేల్ విడుదల వాయిదా పడే అవకాశాలున్నాయంటూ మరో వార్త తెరపైకి వచ్చింది. తాజాగా తండేల్ సంక్రాంతి బరిలో నిలువబోతుందన్న అప్‌డేట్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. మరోవైపు రాంచరణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న గేమ్ ఛేంజర్ 2025 జనవరి 10న విడుదల కానుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారని తెలిసిందే. ఇదే నిజమైతే బాక్సాఫీస్ వద్ద గేమ్ ఛేంజర్‌తో పోటీ పడటం ఖాయమైపోయినట్టే. మరి తండేల్ రిలీజ్‌పై మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. తండేల్‌లో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయి సత్య పాత్రలో నటిస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడం విశేషం. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్‌లో చైతూ మత్స్యకారుడిగా మాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు.

# ఇడ్లీ కొట్టుతో వస్తోన్న నిత్యామీనన్



ఎంచుకునే ప్రతి పాత్రలోనూ తన సహజమైన నటనతో సినీప్రియుల్ని మెప్పిస్తుంటుంది అందాల తార నిత్యామేనన్. ఇటీవలే ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్న ఈమె.. తమిళ కథానాయకుడు ధనుష్‌తో కలిసి 'ఇడ్లీ కడై'(ఇడ్లీ కొట్టు) అనే చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. 'కొత్త ప్రకటన.. కొత్త ప్రయాణం... 'ఇడ్లీకడై' అనే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా ఓ ఫొటోను పంచుకుంది నిత్య. ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభమైనట్లు చిత్రవర్గాలు తెలిపాయి. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ధనుష్ తెరకెక్కిస్తున్నారు. డాన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, షాలినీ పాండే తదితరులు నటిస్తున్నారు. 'తిరు' చిత్రంలో స్నేహితులుగా కనిపించి అభిమానుల్ని అలరించిన ధనుష్, నిత్య.. మరి ఈసారి తెరపై ఎలాంటి మ్యాజిక్ సృష్టిస్తారో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# సుశాంత్ ఇంటిని కొనేసిన ఆదాశర్మ

### పబ్లిసిటీ కోసమే అన్న విమర్శలను తోసిపుచ్చిన నటి

బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఇంటిని నటి అదాశర్మ కొనుగోలు చేసిన తరవాత ఆ ఇంటిని రీమోడలింగ్ చేసి ఇటీవలే కుటుంబంతో సహా అక్కడికి షిఫ్ట్ అయ్యారు. అయితే.. ఆమె పబ్లిసిటీ కోసమే ఇలా చేస్తున్నారని కొందరు ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా వీటిపై అదా స్పందించారు. ఒక నటిగా తనకు చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని ఇలాంటివాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అలాగే ఆ ఇంటిని ఉద్దేశించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'మన జీవితంలో చేయాల్సిన పనులు చాలా ఉంటాయి. అభిప్రాయాలు తెలపడానికి మన దేశంలో పూర్తి హక్కు ఉంటుంది. నేను ఈ ఇంటిని కొనుగోలు చేయడంపై కూడా ఎవరి అభిప్రాయాలు వాళ్లు వెల్లడించారు. 'నేను మంచి వ్యక్తిని' అని రుజువు చేసుకోవాల్సిన అవసరం లేదు. నాకు చేయాలనిపించినది నేను చేశా. నా కోసం ఎవరూ మారకూడదని నేను అనుకుంటాను. అదే రూల్ ఇతరులకు వర్తిస్తుంది. వారి కోసం నేను నా పద్ధతిని మార్చుకోను' అని చెప్పారు. ఇక సుశాంత్ ఇంటి గురించి మాట్లాడుతూ.. 'నాకు ఈ ఇల్లు ఎంతో నచ్చింది. మా అమ్మ, అమ్మమ్మతో కలిసి ఇక్కడ ఉంటున్నాను. ఈ ఇంట్లో ఏదో తెలియని శక్తి ఉంది' అని తెలిపారు. గతంలోనూ ఈ ఇంటిపై అదా ఇలాంటి కామెంట్సే చేశారు. సుశాంత్ ఇంటిని చూడగానే తనకు ఎంతో పాజిటివ్‌గా అనిపించిందన్నారు. అందుకే కొన్నట్లు వెల్లడించారు. మొత్తం రీమోడలింగ్ చేశానన్నారు. మొదటి అంతస్తుని గుడిలా



మార్చేసి నట్లు చెప్పారు. ఒక గదిని మ్యూజిక్ రూమ్‌గా, మరో దాన్ని డ్యాన్స్ స్టూడియోగా చేశానన్నారు. టెర్రస్ మొత్తం గా÷-డ్గ÷న్‌లా మార్చేసినట్లు తెలిపారు. నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ 2020 జూన్ 14న ఆత్మహత్య చేసుకున్నారు. తన నివాసంలోనే ఉరి వేసుకున్నారు. సినిమాల్లో అవకాశాలు లేకపోవడం, వ్యక్తిగత కారణాల వల్ల మానసిక కుంగుబాటుకు గురి కావడంతోనే ఆయన మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఇప్పుడు అదే ఇంటిని అదా కొనుగోలు చేసి అందులోకి షిఫ్ట్ కావడంతో బాలీవుడ్‌లో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.